# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్”లో పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.
- ❖ సంప్రదాయ నీటి నిర్వహణ పద్ధతులకు ఆధునిక సాంకేతికతను జోడించి, పటిష్ఠమైన జల సంరక్షణ చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి.

====================

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణి ద్వారా నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమం 130వ సంచికలో ఆయన ఈరోజు ప్రసంగించారు. దేశంలో తయారయ్యే ఏ వస్తువుపైనా నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలే లక్ష్యంగా ముందుకు సాగాలని పారిశ్రామికవేత్తలకు, అంకుర సంస్థల యువతకు పిలుపునిచ్చారు. జీరో డిఫెక్ట్ - జీరో ఎఫెక్ట్ మన నినాదంగా మార్చుకోవాలని, అప్పుడే వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ప్రధాని స్పష్టం చేశారు. నాణ్యత అనేది కేవలం ఒక ప్రమాణం మాత్రమే కాదు, అది దేశ గౌరవానికి చిహ్నమని ఆయన పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో భజనలు, కీర్తనలు శతాబ్దాలుగా అంతర్భాగమని, వాటిని నేటి తరం యువత తమ జీవనశైలిలో భాగం చేసుకుంటూ భజన్ క్లబ్బింగ్ అనే కొత్త సంస్కృతికి నాంది పలికారని ప్రశంసించారు. మలేషియాలో భారతీయ మూలాలున్న ప్రజలు తమ సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును ప్రధాని అభినందించారు. వచ్చే నెలలో జరగనున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... కృత్రిమ మేధ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని, విజయాలను ఈ సదస్సు ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు.

====================

అనంతపురంలో నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలు చేపడుతున్న చర్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించడానికి ప్రజలు స్వయంగా జలాశయాలను పునరుద్ధరించడానికి ముందుకు వచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ఇప్పటి వరకు 10కి పైగా జలాశయాలను పునరుద్ధరించారని.. 7 వేలకు పైగా చెట్లను నాటారని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

ప్రధాని నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను వ్యక్తం చేసే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులు తిలకించారు. అనంతపురంలో నీటి సంరక్షణ గురించి ప్రపంచానికి తెలియచెప్పడం గొప్ప విషయమని కోనసీమ జిల్లా వాసి హరికృష్ణ ప్రసాద్ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

====================

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి ఆయన ఈరోజు ఒక సందేశాన్ని విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే రోజు అని, వారి త్యాగాల ఫలితంగా నేడు మనం స్వేచ్ఛా ఫలాలను అనుభవిస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. జాతీయ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి, సంఘీభావం, విశ్వభ్రాతృత్వం వంటి ఉన్నత ఆదర్శాలకు మనమంతా కట్టుబడి ఉండాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

విరామం

====================

'మన్ కీ బాత్' కార్యక్రమంలో జల సంరక్షణలో అనంతపురం జిల్లా ప్రజల స్ఫూర్తిదాయక కృషిని ప్రస్తావించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర విజన్'లో భాగంగా రూపొందించిన 'పది సూత్రాల'లో జల భద్రత అత్యంత కీలకమైనదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ నీటి నిర్వహణ పద్ధతులకు ఆధునిక సాంకేతికతను జోడించి, పటిష్ఠమైన జల సంరక్షణ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశం ఈ దిశగా తమ సంకల్పానికి మరింత ప్రేరణనిచ్చిందని ముఖ్యమంత్రి కొనియాడారు.

====================

శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దర్శనం అనతరం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... సూర్యజయంతి వేడుకలను రాష్ట్ర పండుగ హోదాలో ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సూర్యప్రభవాహనంతో వాహనసేవలు ప్రారంభమయ్యాయి.

====================

ఓటు వేయడం కేవలం ఒక హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయానంద్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత

విలువైనదని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

=====================

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటర్లకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, సమావేశాలను జిల్లా యంత్రాంగాలు నిర్వహించాయి. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, యువతను అధికారులు భాగస్వాములు చేశారు. ఓటరుగా నమోదు చేసుకున్న అర్హులకు ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు.

=====================

కేంద్ర మహిళ శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు, భారతదేశాన్ని బాల్య వివాహ రహిత దేశంగా మార్చే లక్ష్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 100 రోజుల అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజలను, విద్యార్థులను చైతన్య పరుస్తున్నామని ప్రాజెక్ట్ అధికారి శారదా దేవి తెలిపారు.

=====================

=====================